# ఆడా, మొగా కాని అసభ్యం

ఇంటర్ తరగతిలో ప్రయాణంచేసే వాళ్ళంటే నాకు ఎంతమాత్రమూ గౌరవభావం కలగదు.

ఇంటర్ తరగతి ప్రయాణీకుడు తన దుస్థితిని తానే ఎన్నుకుని, తనంతట తానుగానే అందులో ప్రవేశించాడు. అటు ఫస్టు, సెకండుక్లాసు లున్నాయి; ఇటు థర్డుక్లాసు వుంది. వీటిని కాదని ఇతడు ప్రత్యేకం ఇంటర్‌లో జొరబడుతున్నాడు. ఇతడికోసమే ఇంటర్ అనే నూతన ప్రపంచం-కృత్రిమ ప్రపంచం-సృష్టించబడింది. ఇతడే లేకపోతే ఇంటరేలేదు...

ఇంటర్ తరగతిలో ప్రయాణంచేసే ఆసామీని దేనితోనో వొక దానితో సిసలుగా పోల్చి చూపిస్తేతప్ప ఇతడిలోని హీనత్వం, నీచత్వం, కృత్రిమ స్వభావం సరిగా బోధపడవు. ఆమధ్య ఒకరచయిత-బెర్నార్డ్ షా అని జ్ఞాపకం-వర్గచైతన్యం అనే పదాన్ని వ్యాఖ్యానిస్తూ ఇలా వ్రాశాడు:—

'బూర్జువావర్గానికి'—అంటే, ధనికవర్గానికి-చెందినమనిషి రోజూ ఒక కొత్త చొక్కా తొడిగి అవతల పారేస్తాడు-'అప్పర్ మిడిల్ క్లాస్' లేక పైవరుస మధ్యతరగతికి చెందిన వ్యక్తి ఒక గట్టి చొక్కాను ఒక మారుకంటే ఎక్కువసార్లు తొడుగుతాడు-'లోయర్ మిడిల్ క్లాస్', లేక క్రిందివరుస మధ్య తరగతికి చెందిన వ్యక్తి చిరుగు చొక్కాను కుట్టుకుని, ఆ చిరుగు ఎవరికేనా కనిపిస్తుందేమోనని భయపడుతూంటాడు-ఇక 'ప్రోలిటేరియట్' అనబడే బీద వర్గాలవారంతా కుట్టడానికి కూడా వీలులేనంత పెద్ద చిరుగుగల చొక్కాను ఒక పెద్ద గాయంలా ప్రదర్శిస్తూ తమ హీనస్థితిని ప్రచారంచేసుకొంటారు...

ఈ కొలమానంతో కొలిచిచూస్తే ఇంటర్ తరగతి ప్రయాణీకుడు చిరుగు చొక్కాను తొడుక్కొని, ఆ చిరుగు ఎవరికైనా కనిపిస్తుందేమోనని భయపడుతూండే వారి తరగతికి చెందుతాడు...

ఇంటర్ తరగతి పెట్టికి ఒక ప్రక్క ఫస్టు, సెకండు క్లాసులూ, ఒక ప్రక్క థర్డు క్లాసూ వుంటాయి. ఈ రెండిటి మధ్యా విధిలేక తనకోసం వెలిసిన స్థానంలో ఇంటర్ టిక్కట్టు కొనుక్కుని కూర్చుంటాడు-ఇంటర్ తరగతి ప్రయాణీకుడు.

ప్రయాణం చేసినంత సేపూ ఇతడిలో వర్గచైతన్యం లేచి ఆడుతుంది. సెకండు, ఫస్టు క్లాసుల వేపు ఆశగా చూస్తాడు; ఎంత చెడ్డా, తన్ను తాను పోల్చుకోవాల్నంటే ఆ పైతరగతివారితోనే పోల్చుకోవాలిగాని థర్డు క్లాసు ముఖాలకేసి చూడనైనా చూడకూడదని ఇతడి గట్టి నిశ్చయం-ఇంటర్ టిక్కట్టును గట్టిగా హృదయానికి అద్దుకుంటూ, అది నీచమైన థర్డు క్లాసు టిక్కట్టు కాదని మురుస్తూ, ఫస్టు, సెండు క్లాసు టిక్కట్టు కూడా కానందుకు ముఖంలో కాస్త ఖేదం కనపరుస్తూ, త్వరలోనే తన ఇంటర్ టిక్కట్టు ఏ సెకండు, ఫస్టు క్లాసు టిక్కట్టుగానో మారాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ, అటు ఫస్టు సెకండుక్లాసు ప్రయాణీకుల హాస్యానికి, ఇటు థర్డు క్లాసు ప్రయాణీకుల విస్మయానికీ గురి అవుతూ వుంటాడు.

ఆమధ్య నేనూ ఒక మిత్రుడూ మా వూళ్ళో బ్రహ్మసమాజంవారు ఏర్పాటు చేసిన ఒక మీటింగుకు వెళ్ళాం. ఒక గొప్ప వ్యక్తి సమాజపు ఆదర్శాలనుగురించి గంభీరంగా ఉపన్యసించాడు. ఆ ఉపన్యాసం అంతావిని నామిత్రుడు నాతో ఇట్లా అన్నాడు...'రాంమోహనరాయ్ కాలంనుంచీ బ్రహ్మసమాజకులు సంఘానికి చేసిన సేవను మెచ్చుకునే వాళ్ళలో నేనొకణ్ణి. కాని, మతవిషయం చూస్తే వీళ్ళ ధోరణి నాకు కిట్టదు-వీళ్లు సాముచేస్తూంటే స్థలం చాలా ప్రమాదకరమైనది. వీళ్ళు తెగించి ఇటు మనబోటి నాస్తికులతోనూ చెయ్యికలపలేరు, అటు శాస్త్రోక్తమైన హిందూ ఆచారాలనూ పాటించలేరు-ఇటువంటి వాళ్లను చూస్తే నాకు అసహ్యం-వీళ్లు ఆక్రమించే స్థానం చాలా ప్రమాదకరమైనది...'

ఇంటర్ తరగతి ప్రయాణీకుల స్థితి చూస్తే పై మిత్రుడి వచనాలు

జ్ఞప్తికి వస్తున్నాయి. సెకండు, ఫస్టు క్లాసులవాళ్ళతో తమ స్థితిని పోల్చుకుందుకు వీళ్ళకు కలేజాలేదు; థర్డుక్లాసువాళ్ళతో కరస్పర్శ చెయ్యడానికి వీళ్ళకి న్యూనత. ఈ ప్రమాదకరమైన స్థానం ఆక్రమించుకున్నాడు ఇంటర్ తరగతి ప్రయాణీకుడు. ఇతడియొక్క ఈ స్థితికి విమోచన కలగాలంటే బెర్నార్డుషా వర్ణించిన స్వర్గం అమలులోకి రావాలి. ఆస్వర్గంలో థర్డుక్లాసు రైలుపెట్టెలులేవు. అంటే, ఇంటరూ, సెకండూ కూడా వుండవన్నమాట-ఉండేదల్లా ఒక్కటే తరగతికి ప్రస్తుతంలో ఆ తరగతి మరొకమాట కనిపించక 'ఫస్టుక్లాస్' అని అనాల్సివొస్తూంది.

---

# చేసినపాపం చెబితే పోతుందా?

చిన్నప్పట్నుంచీ మన పెద్దలు మనకు నూరిపోసే కాపీ పుస్తకపు నీతులలో ఇవొకటి-చేసిన పాపం చెబితే పోతుందట! ఏదైనా ఒక పాపిష్టి పనిని చేసి, పదిమందితోనూ 'ఇది ఇలా చేసేనర్రా, నా మొహాం మండా!' అని చెబితే ఆ చేసిన పాపం పటాపంచలై పోతుందట. అంతటినుంచీ మళ్ళీ పామేదాలాగ తిరగవచ్చునట. ఇలాగ మనం ఎన్ని పాపాలైనా చేయవచ్చు. ఆ పాపాలనుండి విముక్తి చెందవచ్చు. దొంగతనం చెయ్యండి, పక్క ఇంటివాడి పెళ్ళాన్ని లేవగొట్టండి, దారికాసి ఖూనీచేయండి. ఏదైనాచేయండి. చేయడం తడవుగా ఇలా చేసేనని నలుగురితోనూ చెప్పేస్తే ఆ పాపం పోతుంది. ఎంత సులువుగా వుంది ఈ అరేంజిమెంటు!

చేసిన పాపం చెప్పినంత మాత్రాన పోయేమాటైతే చేసిన పుణ్యానికి గిట్టుబాటు బహు తక్కువగా వుండాలి. ఈ కొలమానంతో కొలిచి చూస్తే పాపం చేసినవాడి స్థితీ, పుణ్యం చేసినవాడి స్థితీ రమారమి ఒకలాగనే వుంటుంది-చేసినపాపం చబితే పోతుంది కాబట్టి అంతాకూడా తాము చేసిన పాపాలను వెల్లడిచేసి పాపాత్ములనే పేరునుండి తప్పించు